

టీడీపీతోనే భవిత

పదేళ్లు సీఎంగా చంద్రబాబు

- పవన్ నోట ఇదే మాట.. పార్టీ కోసం కష్టపడండి
- లేదంటే రాష్ట్రం అధోగతే.. చరిత్ర చెప్పిందిదే
- రానున్న రోజుల్లో బీసీలకు పెద్ద పీట
- టీడీపీ జిల్లా మహానాడులో నేతల స్పష్టీకరణ



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

భీమవరం/తణుకు/తణుకు రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి):'రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలన్నా పేదలు అభ్యున్నతి చెందాలన్నా మరో 15 ఏళ్లపాటు తెలుగుదేశం అధికారంలో ఉండాలి. ఎన్టీఆర్ పార్టీ స్థాపించిన తర్వాత రాష్ట్రం అభివృద్ధి దిశగా అడుగులు వేసింది. పేదలకు కూడు, గూడు, గుడ్డ లభించింది. తెలుగుదేశం ఓటమి చెందిన ప్రతీసారి రాష్ట్రం అధోగతి పాలైంది. అభివృద్ధి వెనుకబడింది. 2019 నుంచి 2024 వరకు ఐదేళ్ల రాక్షస పాలన సాగింది. దుర్మార్గపు పాలన అంతమొందించడానికి ప్రతి కార్యకర్త కష్టపడ్డారు. ఎన్నో అవమానాలు భరించారు. అహర్నిశలు శ్రమించి టీడీపీ కూటమిని అధికారంలోకి తెచ్చారు. ప్రజలు అండగా నిలిచారు. రాష్ట్ర భవిష్యత్తు మళ్లీ గాడిలో పడింది. ఇదే అభివృద్ధి కొనసాగాలంటే, రాజధాని, పోలవరం ప్రాజెక్టులు పూర్తి కావాలంటే మన ప్రభుత్వం 15 ఏళ్లపాటు కొనసాగాలి. రాష్ట్రం కోసం, ప్రజల కోసం టీడీపీ ప్రభుత్వాన్ని కాపాడుకుందాం' అంటూ తెలుగుదేశం పార్టీ నేతలు పిలుపునిచ్చారు. తణుకులో శనివారం సాయంత్రం టీడీపీ జిల్లా మహానాడు పార్టీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు ఆధ్వర్యంలో జరిగింది. స్థానిక ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పర్యవేక్షణలో మహానాడు విజయవంతమైంది. పొలిట్ బ్యూరో సభ్యులు, ఎంఎల్ఏలు, కార్పొరేషన్ చైర్మన్లు, ముఖ్యనేతలు, కార్యకర్తలు, నాయకులు హాజరయ్యారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు తెలుగుదేశం ప్రస్థానంపై ముఖ్య నాయకులు ప్రస్తావించారు. గతంలో పార్టీకి పునాది వేసి ఎన్టీఆర్ అభివృద్ధి చేస్తే వర్తమానంలో చంద్రబాబు, భవిష్యత్తులో లోకేశ్ కీలకంగా ఉంటారని స్పష్టం చేశారు. రాష్ట్రంలో దుర్మార్గపు పాలన అంతమొందించడానికి కలసి వచ్చిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు అభినందనలు తెలిపారు. తెలుగుదేశం కూటమి ఐక్యతగా ఉండాలని, కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు అభినందిస్తూ తీర్మానం చేశారు. మహానాడులో ఆరు తీర్మానాలను ఆమోదించారు. నాలుగు దశాబ్దాలుగా పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తూ అండగా ఉంటున్న కార్యకర్తల సంక్షేమం కోసం నిధిని ఏర్పాటు చేయాలంటూ మహానాడు తీర్మానించారు.



తణుకులో జరిగిన టీడీపీ మినీ మహానాడులో మాట్లాడుతున్న పితాని సత్యనారాయణ, వేదికపై ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, షరీఫ్, మంతెన, తోట, వలవల, అంగర, పీతల తదితరులు

సంక్షేమం, అభివృద్ధి దిశగా పాలన : మంతెన



జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు మాట్లాడుతూ 'పేదల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా టీడీపీ ఏర్పడింది. ఆ లక్ష్య సాధనే ధ్యేయంగా పాలన సాగిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ కార్యకర్తలపై ఎన్ని కేసులు బనాయించి నిర్బంధాలు పెట్టినా కార్యకర్తలు లెక్క చేయకుండా పార్టీని ముందుకు నడిపించార'ని చెప్పారు.

పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు : ఆరిమిల్లి



తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ 'క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు టీడీపీ తగిన గుర్తింపు నిస్తుంది. కార్యకర్తల సంక్షేమానికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. జగన్ వ్యవస్థలను నాశనం చేశారు. సోషల్ మీడియా ద్వారా చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు తిప్పికొట్టాలి' అని పిలుపునిచ్చారు.



హాజరైన పార్టీ కార్యకర్తలు

విప్లవాత్మకమైన మార్పులు : గన్ని



ఆప్కాబ్ రాష్ట్ర చైర్మన్ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ 'ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సారథ్యంలో రాష్ట్రంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అమరావతి, పోలవరం, విశాఖ స్టీల్ ప్లాంటు, రైల్వే జోన్ వంటి పలు పనులు పురోగతిలో ఉన్నాయి' అని అన్నారు.

అభివృద్ధికి సహకరించాలి : ముళ్లపూడి



తణుకు మాజీ ఎమ్మెల్యే ముళ్ళపూడి వెంకట కృష్ణారావు మాట్లాడుతూ 'క్రమశిక్షణతో ప్రజలకు సేవ చేయాలనే ఆలోచన ఉన్న వారు పార్టీ ద్వారా సేవ చేయవచ్చు. ప్రజలకు న్యాయం చేయాలనే ప్రధాని మోదీ, పవన్, సీఎం చంద్రబాబు కలసి పనిచేస్తున్నారు. మూడు పార్టీలు సమష్టిగా పని చేసి అభివృద్ధికి సహకరించాలి' అన్నారు.

• బీసీలకు ప్రాధాన్యం : పితాని

మహానాడులో సామాజిక న్యాయంపై చర్చ సాగింది. ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో బీసీలకు తగిన ప్రాధాన్యం లభించాలని టీడీపీ బీసీ సెల్ నాయకుడు గౌరునాయుడు తదితరులు ప్రస్తావించారు. దీనిపై పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ స్పందించారు. 'నామినేటెడ్ పదవుల్లో బీసీలకు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం వాస్తవమే. నీటి సంఘాలు, మార్కెట్ కమిటీల్లో తగిన ప్రాధాన్యం ఇచ్చారు. ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ ఎన్నికలకు అంతా సిద్ధం కండి. బీసీలకు తగిన ప్రాధాన్యం వస్తుంది. కార్పొరేషన్‌లలో బీసీలకు ప్రాధాన్యం ఇవ్వలేదన్న చర్చ సాగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లా. కార్పొరేషన్ పాలకవర్గాల్లో అయినా బీసీలకు, ఎస్సీలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కోరాను. చంద్రబాబు అందుకు సమ్మతించారు. సభా ముఖంగా ఈ విషయాన్ని చెబుతున్నా. బీజేపీ, టీడీపీ, జనసేన కలసికట్టుగా పనిచేయాలి. జనసేనను తక్కువ చేయడానికి లేదు. ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుంది' అంటూ పితాని ప్రకటించారు.

స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలి : పొత్తూరి



నరసాపురం టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

• 15 ఏళ్లు అధికారంలో టీడీపీ : షరీఫ్



శాసనమండలి మాజీ చైర్మన్, మైనారిటీ వ్యవహారాల సలహాదారు షరీఫ్ భవిష్యత్తులో తెలుగుదేశం ఆవశ్యకతను వివరించారు. 'వచ్చే 15 ఏళ్లు తెలుగుదేశం ప్రభుత్వం ఉండాలి. రాష్ట్రంలో రోజుకు 18 గంటలు పనిచేసిన సీఎం, అనుభవజ్ఞుడైన చంద్రబాబు పదేళ్లపాటు ముఖ్యమంత్రిగా ఉంటారు. దీనిని జనసేన అధినేత పవన్ కల్యాణ్ చెప్పారంటే రాష్ట్ర భవిష్యత్తుకు ఈ ప్రభుత్వం ఎంత అవసరమో ప్రతి కార్యకర్త గుర్తించి, క్రమశిక్షణతో పార్టీ కోసం కష్టపడాలి. హైదరాబాదులో వచ్చే ఆదాయం 75 శాతం ఐటీ ద్వారానే వస్తుంది. అది చంద్రబాబు ద్వారానే సాధ్యమైంది' అని అన్నారు..

• తెలుగు వారి పండగ : తోట



పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ 'టీడీపీ మహానాడు అంటేనే తెలుగువారి పండగ. ఎన్‌టీఆర్ పార్టీయే పేదల పార్టీ. కార్యకర్తలంతా టీడీపీ తమ సొంత పార్టీ భావిస్తారు. పేదల కోసం పింఛన్లు, ఆస్తిలో సమాన హక్కు, రెండు రూపాయలకే కిలో బియ్యం వంటి పథకాలు అమలు చేసిన ఘనత ఎన్టీఆర్‌దే. ఆ పథకాలను చంద్రబాబు మరింతగా కొనసాగిస్తున్నారు' అని చెప్పారు.

• టీడీపీ కార్యకర్తలే కొండంత బలం : పీతల



ఏపీ మహిళల సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్మన్ పీతల సుజాత మాట్లాడుతూ 'టీడీపీకి కార్యకర్తలే కొండంత బలం. ఎన్టీఆర్ నుంచి నుంచి చంద్రబాబు, లోకేశ్ వరకు కార్యకర్తల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇసున్నారు. టీడీపీ ద్వారానే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం. సామాజిక సమీకరణాల వల్ల ఆలస్యం కావచ్చు తప్ప, అందరికి న్యాయం జరుగుతుంది' అని అన్నారు.

• ఆ స్ఫూర్తి మరువలేం : వలవల



తాడేపల్లిగూడెం టీడీపీ ఇన్‌చార్జి, రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల బాబ్జి మాట్లాడుతూ 'గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు 53 రోజుల జైలులో వున్నప్పుడు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అందించిన స్ఫూర్తి మరువలేం. పార్టీ భవిష్యత్ నిర్మాణంలో లోకేశ్ ఎంతో కృషి చేస్తున్నార'ని చెప్పారు.

నకిలీ మందులు అమ్ముతున్నారా..?

86323 30909

వాట్సాప్ నంబర్‌కు సమాచారం ఇవ్వండి

- చర్యలు తీసుకుంటాం : జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అబిద్ ఆలీసాయిక్
- ఆంధ్రజ్యోతి ఫోన్‌ఇన్‌లో వెల్లడి



భీమవరం టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): లైసెన్స్ లేకుండా మందులు విక్రయించినా, నిషేధిత, నకిలీ మందులు అమ్మినా, ధరలు ఎక్కువ తీసుకున్నా అలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రజలు వీటిని గుర్తిస్తే వాట్సాప్ నెంబరు 86323 30909కు సమాచారం ఇస్తే నిఘా పెట్టి వాటిని నియంత్రిస్తాం. ఫిర్యాదుదారు వివరాలు గోప్యంగా ఉంచుతాం. మేం ప్రతీ నెలా మందుల షాపులను తనిఖీ చేస్తాం. పలు కంపెనీల మందులను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌లకు పంపిస్తాం. అవి నకిలీ, కాలం చెల్లినవని తేలితే చర్యలు తీసుకుంటున్నాం. మందులపై ఎవరికైనా అనుమానం వస్తే భీమవరం, తణుకు పట్టణాల్లోని డ్రగ్ కంట్రోలర్ కార్యాలయాల్లో ఫిర్యాదులు చేయవచ్చు. సంబంధిత షాపులపై ఆకస్మిక తనిఖీలు చేస్తాం. ఇప్పటికే జిల్లాలో 80 కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచాం. ప్రజలకు నాణ్యమైన మందులు అందించేందుకు మేం కృషి చేస్తున్నాం' అని జిల్లా డ్రగ్ ఇనస్పెక్టర్ అబిద్ ఆలీ సాయిక్ తెలిపారు. శనివారం జరిగిన 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్'లో ప్రజలు అడిగిన పలు సమస్యలు, ప్రశ్నలకు ఆయన స్పందించారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

- లోకల్‌గా దొరకని మందులను ఎటువంటి వైద్యుని సిఫారసు లేకుండా ఆన్‌లైన్‌లో అమ్ముతున్నారు. దీనిపై నిఘా పెట్టాలి.

- కె.సత్యనారాయణ, భీమవరం

ఆలీ సాయిక్ : ఆన్‌లైన్ మందుల విక్రయాలపై వచ్చిన సమాచారం మేరకు చర్యలు తీసుకుంటున్నాం. సంబంధిత షాపులకు లైసెన్స్ ఉందా ? లేదా ? అని పరిశీలిస్తాం. లేకపోతే సెక్షన్ 18(సి) ప్రకారం కేసులు నమోదు చేస్తాం. ఆన్‌లైన్ అమ్మకాలపై దృష్టి పెడతాం.

- మా చిన్నాన్నను రాజమండ్రిలోని మానసిక వైద్యులకు చూపించాం. ఆయన రాసిన చీటీ ఇక్కడ చూపించినా మందులు ఇవ్వడం లేదు. ఇబ్బందులు పడుతున్నాం.

- వెంకటేశ్వరరావు, తాడేపల్లిగూడెం

ఆలీ సాయిక్ : వైద్యులు రాసిన చీటీ ఆధారంగా ఒకసారి మాత్రమే మందులు ఇచ్చే అవకాశం ఉంది. ఈసారి వైద్యులతో ఎన్నిరోజులు వాడాలనేది స్పష్టంగా రాయించుకుంటే దాని ఆధారంగా ఇక్కడ మందులు ఇస్తారు.

- జనరిక్ మందులు, కంపెనీ మందులు తెలియడం లేదు. ఎలా గుర్తించాలి ?

- వెంకటబాలాజీ, నరసాపురం

ఆలీ సాయిక్ : ప్రభుత్వం జనరిక్ మెడికల్ షాపులను ఏర్పాటు చేస్తోంది. అక్కడ కొంటేనే మంచిది. ఎమ్మార్పీకంటే ఎక్కువ ధరకు మందులు విక్రయించినట్లు గుర్తిస్తే మాకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

- మెడికల్ షాపు పెట్టాలంటే ఏం చేయాలి ?

- వాడపల్లి పృథ్వీరాజ్, మాముడూరు

ఆలీ సాయిక్ : షాపు పెట్టుకోవాలనుకునే వారు ముందుగా హోల్‌సేల్, రిటైల్ ఏదనేది నిర్ణయించుకోవాలి. రిటైల్ అయితే బి.ఫార్మసీ పాస్ అయిన సర్టిఫికెట్‌తో ఆంధ్రప్రదేశ్ డ్రగ్ అండ్ కంట్రోల్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. హోల్‌సేల్ షాపునకు టెన్త్ లేదా డిగ్రీ పాస్ అయి ఉండాలి. హోల్‌సేల్ షాపుల్లో పని చేసిన అనుభవం ఉండాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే 15 రోజుల్లో అనుమతి ఇస్తాం.

- పర్సంటేజ్‌లతో మందుల విక్రయాలు జరుగుతున్నాయి ? ఏమైనా చర్యలు తీసుకునే అవకాశం ఉందా ?

- ఎం.అంజనేయులు, పెంటపాడు

ఆలీ సాయిక్ : షాపుల యజమానులకు కంపెనీలు మార్జిన్‌లు ఇస్తాయి. దాని ఆధారంగా వారు ధరలు నిర్ణయించుకుని అమ్మకాలు చేస్తుంటారు. వాటిపై మా నియంత్రణ ఏమి ఉండదు. కొనుగోలుదారుని నిర్ణయంపై ఉంటుంది.

- మెడికల్ షాపుల్లో ఇబ్బందులపై ఏదైనా ఫిర్యాదు చేయాలంటే ఎలా ?

- జె.ప్రసాద్, వీరవాసరం

ఆలీ సాయిక్ : ఏదైనా మెడికల్ షాపులో మందుల విషయంలో అనుమానం వస్తే భీమవరం, తణుకులోని మా కార్యాలయాల్లో ఫిర్యాదు చేయండి. లేదా 86323 30909 వాట్సాప్ నంబరుకు గానీ, డీఏసీ-జీఆర్ ఎంఎస్, ఏపీజీవోవీ.ఇన్ వైబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయండి. ఫిర్యాదు పరిశీలించి నిజమని తేలితే చర్యలు తీసుకుంటాం.

ఈఏపీ సెట్‌లో 55 మంది గైర్హాజరు

భీమవరం రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని ఏడు పరీక్ష కేంద్రాల్లో శనివారం ఏపీఈఏపీ సెట్ ఉదయం సెషన్ మాత్రమే పరీక్ష నిర్వహించారు. 1,073 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 1,018 మంది హాజరయ్యారు. 55 మంది గైర్హాజరయ్యారు. భీమవరం డీఎన్నార్‌లో 101 మంది విద్యార్థులకు 95, విష్ణులో 109కి 102, విష్ణు మహిళా కళాశాలలో 87కి 81, ఎస్ఆర్‌కేఆర్‌లో 170కు 165 మంది హాజరయ్యారు. నరసాపురం స్వర్ణాంధ్రలో 150కు 146, తాడేపల్లిగూడెం వాసవిలో 219కి 212, శశి కళాశాలలో 227 మందికి 217 మంది విద్యార్థులు హాజరయ్యారు.

ఎస్ఎస్‌సీలో 778 మంది గైర్హాజరు

ఎస్ఎస్‌సీ అడ్వాన్స్ సప్లిమెంటరీ జీవశాస్త్రం పరీక్ష శనివారం జరిగింది. జిల్లాలో 2,978 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 2,200 మంది హాజరయ్యారు. 778 మంది గైర్హాజరయ్యారు. ఎటువంటి మాస్ కాపీయింగ్ నమోదు కాలేదని డీఈవో నారాయణ తెలిపారు.

ఉండేదెవరు ? వెళ్లేదెవరు ?

- నరసాపురం మునిసిపాలిటీలో బదిలీలకు పలువురు ఉద్యోగుల ప్రయత్నాలు
- ఇంజనీరింగ్ సెక్షన్‌లోనే అత్యధికం.. ఇక్కడ పనిచేసేందుకు అనాసక్తి



నరసాపురం, మే 24(ఆంధ్రజ్యోతి):నరసాపురం పురపాలక సంఘంలో ఇప్పటికే చాలా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పోస్టింగ్ ఇచ్చినా.. ఎవరూ వచ్చేందుకు మక్కువ చూపడం లేదు. దీంతో అరకొర సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారు. తాజాగా బదిలీలకు ప్రభుత్వం గేట్లు తెరవడంతో చాలా మంది ఉద్యోగులు మరో పురపాలక సంఘంలోకి వెళ్లేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. వీరిలో గత ఏడాది బదిలీలపై వచ్చిన వారే ఉన్నారు. ఎక్కువ ఇంజనీర్ సెక్షన్‌లో పని చేసే సిబ్బందే ఉన్నారు. పురపాలకలో ఇలాంటి పరిస్థితులు తలెత్తడానికి అనేక కారణాలు ఉన్నాయి. ఓ అధికారి పనితీరు, రాజకీయ ఒత్తిళ్లు, విజిలెన్స్ విచారణ జరుగుతుండటంతో ఉద్యోగుల్లో భయాందోళన నెలకొంది. వచ్చే ఏడాది పుష్కరాల పనులు ప్రారంభం కానున్నాయి. ఇప్పుడే విజిలెన్స్ విచారణలు మొదలైతే రానున్న రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనన్న భయంతో చాలామంది పక్క పురపాలకంవైపు చూస్తున్నారు. ఇప్పటికే కొందరు అక్కడ ప్రజాప్రతినిధుల నుంచి సిఫారసు లేఖలు తెచ్చుకున్నారు.

ఇంజనీరింగ్ విభాగంలో..

పర్యావరణ శాఖ ఏఈ పోస్టు ఖాళీగా ఉంది. గతంలో ఇక్కడ పనిచేసిన మణి భీమవరం వెళ్లిపోయారు. అప్పటి నుంచి రెగ్యులర్ పోస్టు లేదు. గత ఏడాది బదిలీపై ఇద్దరు ఏఈలు వచ్చారు. ఒక ఏఈ సతీమణి రాజమండ్రిలో

మిగతా 8వ పేజీలో

ఇలా వచ్చి.. అలా..

- నరసాపురం మునిసిపల్ మేనేజర్ నిర్మల కుమారి బదిలీపై వెళ్లిపోవడంతో ఈ పోస్టు ఖాళీగా ఉంది.
- రెవెన్యూ సెక్షన్‌లో ఏడాదిన్నర నుంచి ఆర్వో పోస్టు ఖాళీగా ఉంది. నెల క్రితం డైరెక్టర్ కార్యాలయం నుంచి గుణ్ణం మురళి ఆర్వోగా వచ్చిన ఆయన చేరిన కొద్ది రోజులకే డిప్యూటేషన్‌పై మళ్లీ డైరెక్టర్ కార్యాలయానికి వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది.
- శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ వచ్చే నెలలో పదవి విరమణ చేయనున్నారు.
- సూపర్‌వైజర్‌గా పనిచేసిన చంటి గత ఏడాది భీమవరం వెళ్లిపోయారు. అప్పటి నుంచి రెండో పోస్టు ఖాళీగా ఉంది.
- టీపీవోగా ఇటీవల బాలాజీ నియమితులయ్యారు. ఆయన ఇక్కడ పరిస్థితులు తెలుసుకుని విధుల్లో చేరకుండానే మరోచోట పోస్టింగ్ తెచ్చుకున్నారు. ముగ్గురు టీపీవోలకు ఒక్కరే కొనసాగుతున్నారు.

విద్యుత్ శాఖలో చీకట్లు

- సరఫరాలో తరచూ ఆటంకాలు
- సిబ్బంది కొరతతో పనుల్లో జాప్యం
- అధికారుల చుట్టూ జనం ప్రదక్షిణలు
- గాలి వానలకు తెగిపడుతున్న వైర్లు, కూలుతున్న స్తంభాలు
- విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు రోజుల తరబడి నిరీక్షణ
- ప్రజలకు తప్పని తిప్పలు.. వున్న సిబ్బందిపై అదనపు భారం



ఆకివీడు, మే 24(ఆంధ్రజ్యోతి):విద్యుత్ శాఖలో సిబ్బంది కొరత.. ఇటు వినియోగదారులకు, అటు ఆ శాఖ ఉద్యోగులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. జిల్లాలో విద్యుత్ సర్వీసులకు అనుగుణంగా సిబ్బంది లేరు. లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్, అసిస్టెంట్ లైన్‌మెన్, జూనియర్ లైన్‌మెన్‌లు సంఖ్య తక్కువగా ఉండడంతో మిగిలిన సిబ్బందికే ఇతర ప్రాంతాల బాధ్యతలను అప్పగిస్తున్నారు. దీంతో వీరికి పని ఒత్తిడి పెరిగి విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయలేకపోతున్నారు. అసలే వేసవి.. దీనికితోడు భయంకర గాలిదుమ్ములు.. భారీ వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. తిరిగి విద్యుత్ పునరుద్ధరణకు గంటలు, రోజుల తరబడి సమయం పట్టడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

సరైన మెయింటెనెన్స్ లేక

జిల్లాలో ఇళ్లు, చెరువులు, వ్యవసాయం, పరిశ్రమలు, పాఠశాలలు, కళాశాలలు, గృహ అవసరాలకు సంబంధించి 7.45 లక్షల విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం డివిజన్లకు 31 సెక్షన్ ఆఫీసులు వున్నాయి. 31 మంది ఏఈలకు ఉన్నది మాత్రం 18 మంది. కొందరికి ఆయా సెక్షన్‌లకు ఇన్‌చార్జ్‌లుగా కొనసాగుతున్నారు. 31మంది జూనియర్ ఇంజనీర్లకు 29 మంది ఉన్నారు. ఎల్ఐ, లైన్‌మెన్లు, ఏఎల్ఎం, జేఎల్ఎంలు యాభై శాతానికి పైగా కొరత వుంది. సిబ్బంది కొరత కారణంగా విద్యుత్ సరఫరాలో సరైన మెయింటెనెన్స్ లేకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం, పేలిపోవడం, అధికలోడుతో లోఓల్టేజ్ సమస్య ఏర్పడడం, పాత కండక్టర్లు ఎండకు ఎండి, వానకు తడవడంతోపాటు తీగలు వేలాడడం, ఏబీ స్విచ్‌లు కాలిపోవడం వంటివి తారస్థాయికి చేరుతున్నాయి. సిబ్బంది కొరత కారణంగా సకాలంలో మెయింటెనెన్స్ సరిలేక ప్రభుత్వానికి నష్టం కలుగుతోంది. ఇక వర్షాలు, గాలిదుమ్ముల సమయంలో

మిగతా 8వ పేజీలో




డాగ్ స్క్వాడ్ భవనం ప్రారంభం. పోలీస్ జాగిలం నుంచి పుష్పగుచ్ఛం స్వీకరిస్తున్న ఐజీ

కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలి : ఐజీ అశోక్‌కుమార్

ఏలూరు క్రైం, మే 24 (ఆంధ్రజ్యోతి) : కేసుల దర్యాప్తులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయాన్ని శనివారం వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన తనిఖీ చేశారు. తొలుత ఐజీకి ఏలూరు జిల్లా ఎస్పీ కిశోర్ పూలమొక్కను అందించి స్వాగతం పలుకగా జిల్లా పోలీస్ యంత్రాంగం తరపున పోలీస్ గౌరవ స్వాగతాన్ని పలికారు. జిల్లాలో శాంతి భద్రత, నేర నియంత్రణ, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిర్మూలన, మహిళల రక్షణపై ప్రత్యేక దృష్టి సారించా లని ఆయన సూచించారు. ఏఆర్ విభాగం, డాగ్‌స్క్వాడ్, కమాండ్ కంట్రోల్ రూమ్, డ్రోన్ వినియోగం, డిస్ట్రిక్ట్ క్రైం రికార్డు బ్యూరో, స్పెషల్ బ్రాంచ్, ఫింగర్ ప్రింట్ విభాగాలను ఆయన తనిఖీలు చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

పోలీసు జాగిలాల భవనం ప్రారంభం

ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయ సమీపంలో నూతనంగా నిర్మించిన డాగ్ స్క్వాడ్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. తొలుత డాగ్‌రాఖీ ఐజీకి గౌరవవందనం చేసి పుష్పగుచ్ఛం అందించగా ఆయన స్వీకరించారు. అనంతరం జిల్లాలో సేవలు అందిస్తున్న డాగ్ హ్యాండ్లర్స్, పోలీస్ జాగిలాల విశిష్టతను ఆయన అడిగి తెలుసుకున్నారు. అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు, జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఆర్ఐ పవన్‌కుమార్, ఆర్ఎస్ఐ భాస్కరరావు, నరేంద్ర, డాగ్‌స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్వా క్రాప్ హాలిడేకు రైతుల మద్దతు

» వచ్చేనెల 10న చలో అమరావతికి సిద్ధం : గాంధీభగవాన్‌రాజు

పాలకొల్లు రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): సంక్షోభంలో ఉన్న ఆక్వా రంగానికి పూర్వ వైభవం తీసు కొచ్చే విధంగా పాలకొల్లు జైభారత్ క్షీరారామ ఆక్వా సంఘం ప్రకటించిన క్రాప్ హాలిడేకు ఆక్వా రైతులందరూ మద్దతు తెలపడం అభినందనీయమని చైర్మన్ గొట్టుముక్కల గాంధీభగవాన్ రాజు అన్నారు. పూలపల్లి ఆక్వాసంఘ భవనంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకొల్లు, నరసాపురం, ఆచంట మూడు నియోజక వర్గాల్లోని 60 వేల ఎకరాల్లో ఇప్పటికే 20వేల ఎకరాల్లో క్రాప్ వేయకుండా హాలిడేను ప్రకటించారన్నారు. మిగిలిన 40 వేల ఎకరాల్లో జూలై ఒకటి నుంచి మూడు నెలలు పాటు ఆక్వా క్రాప్ హాలిడే పాటిస్తామన్నారు. ఆక్వా సమస్యలపై జూన్ 10న చేపట్టిన చలో అమరావతి కార్యక్రమానికి ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నామన్నారు. సంఘం నేతలు. బోనం చినబాబు, గుంటూరి చంటిరాజు, పెన్మెత్స సత్యనారాయణరాజు, బోనం రంగయ్యనాయుడు, మేకా ఫణీంద్ర ప్రసాదు, భూపతిరాజు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ఆయుష్ ఆసుపత్రికి ఎన్ఏబీహెచ్ అక్రిడిటేషన్



మాట్లాడుతున్న డాక్టర్ యార్లగడ్డ రమేష్‌బాబు

ఏలూరు, మే 24(ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరంలో నాణ్యత ప్రమాణాలతో వైద్యరంగంలో అందించిన సేవలకు ఆయుష్ ఆసుపత్రికి న్యూఢిల్లీలోని నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ హాస్పిటల్స్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ (ఎన్ఏబీహెచ్) అక్రిడిటేషన్ లభించిందని ఆయుష్ ఆసుపత్రుల నిర్వహణ కమిటీ చైర్మన్ డాక్టర్ యార్లగడ్డ రమేష్‌బాబు తెలిపారు. ఏలూరు అశోక్‌నగర్‌లోని ఆయుష్ ఆసుపత్రిలో శనివారం విలేకరుల సమావేశంలో ఎన్ఏబీహెచ్ అక్రిడిటేషన్ ధ్రువపత్రాన్ని వైద్యులు, సిబ్బందితో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. ఏలూరులో మూడేళ్ల క్రితం ప్రారంభించిన ఆసుపత్రికి ఎన్ఏబీహెచ్ గుర్తింపు లభించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఎన్ఏబీహెచ్ అక్రిడిటేషన్ కో-ఆర్డినేటర్ డాక్టర్ బొప్పన దశరథ్ మాట్లాడారు. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అక్కిన శ్రీరామ్, డాక్టర్ జయలక్ష్మి పాల్గొన్నారు.

28 నుంచి స్పెషల్ కేటగిరీ విద్యార్థులకు కౌన్సెలింగ్

నూజివీడు టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా నూజివీడులోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్‌లో అడ్మిషన్లకు సంబంధించి సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం 28 నుంచి ప్రారంభిస్తున్నట్టు నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ డైరెక్టర్ ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు. ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో క్యాప్, బీఎస్సీ, ఎన్ఎస్ఎస్ స్పోర్ట్స్, తదితర స్పెషల్ కేటగిరీకి సంబంధించి ఈనెల 28 నుంచి 31 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తామన్నారు.



ఆకట్టుకున్న ఫ్యాషన్‌షో




ఏలూరు రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి) : అందమైన అమ్మాయిలు క్యాట్ వాక్‌తో ఏలూరు నగరం సందడిగా మారింది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన మోడల్స్ క్యాట్ వాక్‌తో నిర్వహించిన ఫ్యాషన్ షో ఆకట్టుకుంది. యువతీ యువకుల్లో దాగున్న సృజనాత్మకత వెలుగులోకి తీసుకొచ్చి మోడలింగ్, సినీ రంగాల్లో రాణించేందుకు వారి ప్రతిభను వెలుగులోకి తీసుకొచ్చేలా ఎస్‌జే ఈవెంట్స్ ఆధ్వర్యంలో శనివారం ఏలూరు క్రాంతి కల్యాణ మండపంలో ఫ్యాషన్‌షో నిర్వహించారు. ఈ పోటీల్లో హెయిర్ స్టైల్స్, డ్రసింగ్, వాకింగ్, ఇంటెలిజెన్స్ అంటూ నాలుగు రౌండ్లు జరిగాయి. యువతీ యువకులు, వివాహిత మహిళలు ప్రతిభను చాటారు. ముగ్గురిని విజేతలుగా ఎంపిక చేశారు. ఈవెంట్ నిర్వాహకులు నేహ, జాస్మిన్, తదితరులు పాల్గొన్నారు.

సహకార బదిలీలపై కసరత్తు

» ఉమ్మడి జిల్లాలోని 34 బ్రాంచిల్లో సుమారు 1,450 మందికి తప్పని స్థానచలనం

సహకార శాఖలో బదిలీలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ల నియామకం జరిగి పది రోజులవుతోంది. వీరి నియామకాలకు సంబంధించి అధికారికంగా జీవోలు రావాల్సి ఉంది. మరోవైపు సహకార ఉద్యోగుల బదిలీలపై ఉత్కంఠ నెలకొంది. జూన్ రెండో తేదీలోగా బదిలీల ప్రక్రియ ముగించాల్సి ఉంది. ఆ తర్వాత బదిలీలపై మూడో తేదీ నుంచి నిషేధం అమల్లోకి రానుంది. ఈలోగా కోరుకున్న చోటుకు బదిలీ ఎలా చేయించుకోవాలన్న దానిపై ఉద్యోగుల, సిబ్బంది తర్జన భర్జనలు పడుతున్నారు.

ఏలూరు, మే 24 (ఆంధ్రజ్యోతి) :

గతేడాది సంవత్సరం మధ్యలో బదిలీల వల్ల తమకు ఇబ్బందులు తలెత్తుతాయని రాష్ట్ర కో-ఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయిస్ యూనియన్ అభ్యంతరం తెలిపింది.



దానికి తోడు మరోవైపు అప్పుడే జిల్లాలో సొసైటీల కంప్యూటరీకరణ చేయడంతో ప్రభుత్వం బదిలీల నుంచి సహకారశాఖకు మినహాయింపు ఇచ్చింది. అప్పట్లో ఒకేచోట రెండేళ్ల సర్వీస్ పూర్తయిన వారు ఉన్నారు. డీసీసీబీ 34 బ్రాంచిల పరిధిలో ఉమ్మడి జిల్లాలోని పీఏసీఎస్‌ల్లో 250 సెక్రటరీలు, 1,200 మంది సిబ్బందికి ఈసారి బదిలీ ఖాయంగా కనిపిస్తోంది. గతేడాదికి రెండేళ్లు పూర్తయి మూడో ఏడాదిలోకి వీరంతా ప్రవేశించడంతో మూడు ఆప్షన్ల ప్రాతిపదికన వారు కోరుకున్న చోటకు బదిలీలు చేసేందుకు డీసీసీబీ అధికారులు కసరత్తు ప్రారంభించారు.

సెక్రటరీలకు స్థానచలనం

వ్యాపార లావాదేవీల ఆధారంగా నాలుగు కేటగిరీల కింద పీఏసీఎస్‌ల సెక్రటరీలను విభజించారు. వీరందరికి హెచ్‌ఆర్ పాలసీ అమలు చేస్తున్నందున సుదీర్ఘంగా ఒకేచోట ఏళ్ల తరబడి సెక్రటరీలుగా పనిచేస్తున్న వారికి ఈసారి బదిలీ తప్పనిసరిగా మారింది. ఆరు జిల్లాలకు సంబంధించి గుంటూరులోని రిజిస్ట్రార్ ఆఫ్ కో-ఆపరేటివ్ కార్యాలయం పరిధిలో బదిలీల కసరత్తు జరుగుతోంది. డీఎల్‌పీసీ కమిటీ దరఖాస్తులను స్వీకరిస్తోంది. ఇందులో జిల్లాలో ఎంత మంది స్థానచలనం ఉంటుందో ఈనెలాఖరుకి ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. జిల్లా సహకారశాఖ అధికారి పరిధిలో అసిస్టెంట్, డివిజనల్, ఇతర విభాగాల్లోని రిజిస్ట్రార్లకు స్థాన చలనం కలిగే అవకాశం ఉంది. వీరంతా కలిసి 45 మంది ఉంటారని అంచనా.



విలేకరులతో మాట్లాడుతున్న జేడీ ముక్కంటి

హాస్టల్ భవనాలకు రూ.12 కోట్లు

» రూ.5.72 కోట్లతో మరమ్మతులు
» జూన్ నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు
» సాంఘిక సంక్షేమ శాఖ జేడీ ముక్కంటి

ఏలూరు రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి):ఏలూరు జిల్లాల్లో శిథిలావస్థలో ఉన్న 4 ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను రూ.12 కోట్లతో నూతన భవనాలు నిర్మిస్తునట్లు సాంఘిక సంక్షేమశాఖ ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్ ఎం.ముక్కంటి చెప్పారు. ఏలూరు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో కైకలూరు, పెదపాడు, గండుగొలను, ముదినేపల్లిలలో శిథిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల స్థానంలో రూ.12 కోట్లతో కొత్త భవనాలు నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. ఏలూరు జిల్లాలో మొత్తం 59 ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయని, వాటిలో 53 ప్రభుత్వ భవనాల్లో, 6 ప్రైవేటు భవనాల్లో నిర్వహిస్తున్నామన్నారు. మొత్తం 59 వసతి గృహాల్లో 27 బాలుర వసతి గృహాలలో 1,766 మంది విద్యార్థులు, 32 బాలికల వసతి గృహాల్లో 2,694 మంది విద్యార్థినులు వసతి పొందుతున్నారు. ప్రభుత్వం నిర్వహించే భవనాలలో 52 భవనాలు మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5.72 కోట్లు మంజూరు చేసిందన్నారు. 90 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన 10 శాతం పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. జూన్ మొదటివారం నాటికి భవనాల మరమ్మతులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. 56 సంక్షేమ వసతి గృహాల్లో 448 సీసీ కెమెరాలు అమర్చామన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో 6,900 మంది ప్రవేశాలు లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాలలో 87శాతం, ఇంటర్మీడియట్‌లో 89 శాతం హాస్టల్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ముక్కంటి తెలిపారు.

పూళ్ల హాస్టల్‌లో సమీక్ష

భీమడోలు:రానున్న విద్యాశాఖ సంవత్సరంలో అధికారులు సమన్వ యంతో పనిచేసి హాస్టల్స్ అడ్మిషన్ల లక్ష్యాలను చేరుకోవాలని జేడీ ముక్కంటి పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం భీమడోలు మండలం పూళ్ల ప్రభుత్వ బాలికల వసతి గృహంలో ఉంగుటూరు పరిధిలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఉంగుటూరు పరిధిలోని నిడమర్రు, ద్వారకాతిరుమల, భీమడోలు, ఉంగుటూరు మండలాలకు చెందిన అధికారులు, సిబ్బందికి సూచనలిచ్చారు. సర్పంచ్ సుజాత ప్రసాద్ పాల్గొన్నారు.

ఐవోఈ రాష్ట్ర చైర్మన్‌గా జేహెచ్‌వీ ప్రసాద్



తణుకు రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ (ఐవోఈ) రాష్ట్ర చైర్మన్‌గా తణుకు చెందిన జేహెచ్‌వీ ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఐవోఈ సభ్యుడు వెలగన శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం విజయవాడలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. తణుకు పట్టణానికి చెందిన ప్రసాద్‌తో పాటు భీమవరానికి చెందిన అనిల్‌వర్మ కార్యవర్గ సభ్యుడుగా నూతన కార్యవర్గంలో ఎన్నుకున్నట్లు తెలిపారు.

29,30 తేదీల్లో క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు

ఏలూరురూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ (ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల) ఆధ్వర్యంలో ఈనెల 29, 30 తేదీలలో ఏలూరు సీఆర్ రెడ్డి డిగ్రీ కళాశాల మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆర్ఎస్ఆర్ మూర్తి, అశోక్‌కుమార్, ఎస్‌కే షామీర్‌హుస్సేన్ తెలిపారు. రెండురోజుల పాటు సీనియర్ అండర్- 23 విభాగంలో ఎంపికలు జరుగుతాయన్నారు. క్రీడాకారులు 2002 సెప్టెంబరు ఒకటో తేదీ తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్‌కార్డు, సొంత క్రికెట్ కిట్లు, వైట్ డ్రస్‌తో హాజరవ్వాలని తెలిపారు.

ఓఎల్‌ఎక్స్‌లో ఫ్రిజ్ కొంటానంటూ..

ఏలూరు క్రైం, మే 24(ఆంధ్రజ్యోతి): ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తన పాత ఫ్రిజ్‌ను అమ్ముతానంటూ ఓఎల్‌ఎక్స్‌లో ప్రకటన పెట్టాడు. ఒక వ్యక్తి తాను కొంటానంటూ మాయమాటలు చెప్పి వాట్సాప్‌కు ఒక స్కానర్ పంపి రూ.92 వేలు అపహరించిన ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏలూరు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. ఏలూరు ఎన్‌ఆర్‌పేటకు చెందిన మానుకొండ సాయికృష్ణ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. ఏలూరులోని తన ఇంట్లో ఉన్న పాత ఫ్రిజ్‌ను ఓఎల్‌ఎక్స్‌లో అమ్మకానికి ప్రకటన పెట్టారు. ఒక అజ్ఞాత వ్యక్తి కాల్‌చేసి ఇండియన్ ఆర్మీ ఉద్యోగిని అంటూ తాను కొంటానని ఫ్రిజ్‌ను బేరం కుదుర్చుకున్నాడు. ఫోన్‌పే నంబరు నిర్ధారణ కోసం రెండు రూపాయలు ఫోన్‌పే చేశానన్నాడు. అయితే తనకు రాలేదని సాయికృష్ణ చెప్పడంతో అయితే తన నంబరు పనిచేయడం లేదని యూపీఐ స్కానింగ్ నెంబర్ వాట్సాప్‌లో పెడుతున్నానని దానికి పిన్ ఎంటర్ చేయాలని చెప్పడంతో ఆ మాటలు నమ్మిన సాయికృష్ణ వాట్సాప్‌లో వచ్చిన స్కానర్‌కు పిన్ ఎంటర్ చేయగా వెంటనే సాయికృష్ణ ఖాతాలో ఉన్న రూ.92 వేలు తస్కరించాడు. తాను మోసపోయానని గ్రహించి 1930కు ఫిర్యాదు చేయగా అప్పటికే అజ్ఞాతవ్యక్తి రూ.30 వేలు డ్రా చేసేశాడు. రూ.62 వేలు మాత్రమే సైబర్ సెల్ అధికారులు ఫ్రీజ్ చేశారు. ఈ ఘటనపై ఏలూరు త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సాయికృష్ణ ఫిర్యాదు చేయగా సీఐ వి.కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రైమ్ సమాచారం

లారీ ఢీ కొని ఒకరి మృతి

ఏలూరు క్రైం, మే 24 (ఆంధ్రజ్యోతి) : టీవీఎస్ మోపెడ్‌ను లారీ వెనుక నుంచి ఢీ కొనడంతో మోపెడ్ వెనుక కూర్చున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రూరల్ మండలం పోణంగికి చెందిన యాతం ఆనంద్‌కుమార్(29)కి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వంగాయిగూడెం వద్ద ఉన్న పెట్రోల్ బంక్‌లో పనిచేస్తుం టాడు. శనివారం ఉదయం పనిలోకి రావడానికి అదే గ్రామానికి చెందిన తెలిసిన వారి టీవీఎస్ మోపెడ్‌పై వస్తుండగా చిరంజీవి బస్‌స్టాప్ వద్ద వెనుకనుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై వన్‌టౌన్ సీఐ జి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ మదీనాబాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

చెరువులోకి దిగిన మహిళ మృతి



గంగ (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్, మే24 (ఆంధ్ర జ్యోతి): ప్రమాదవశాత్తు చెరువులోకి దిగిన మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని మెట్టఉప్పరగూడెంలో శనివారం జరిగింది. ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాలివి.. మెట్టఉప్పరగూడెంకు చెందిన సైదు గంగ(42) శనివారం చెరువులో పశువులను కడిగేందుకు తీసుకెళ్లింది. ఈ క్రమంలో గేదె లోపలికి వెళ్లిపోతుందని వెనుకగా వెళ్లిన ఆమె ప్రమాదవశాత్తు లోపలికి వెళ్లి మునిగింది. స్థానికులు గమనించి బయటకు తీసేలోపు ఆమె మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఇనుప రాడ్డు, సుత్తితో కొట్టి చంపేశారు

» ఆటో డ్రైవర్ హత్య కేసులో సంచలన విషయాలు
» ఇద్దరి అరెస్ట్.. వివరాలు వెల్లడించిన డీఎస్పీ జయసూర్య



భీమవరం క్రైం, మే 24 (ఆంధ్రజ్యోతి): తన భార్యతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడన్న అనుమానం, అదేవిధంగా తన ఇంట్లో దొంగతనం చేశాడన్న ఆరోపణలతో ఆటో డ్రైవర్ హత్య జరిగినట్లుగా భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య తెలిపారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. స్థానిక చినరంగనిపాలెంలో నివాసం ఉంటున్న ఆటో డ్రైవర్ కాటూరి దుర్గారావు(28) భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో ఒంటరిగా ఉంటున్నాడు. అదే ప్రాంతానికి చెందిన బొమ్మల వ్యాపారి, ఆటో డ్రైవర్ ఎల్లా కోటేశ్వరరావు(బాబి)తో రెండేళ్లక్రితం పరిచయమైంది. అనంతరం దుర్గారావు బాబి వద్ద ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో ఈనెల 4న దుర్గారావు తన సోదరుడు నివాసం వద్ద ఉండగా ఎల్లా బాబి, తన కుమారుడు వెళ్లి దుర్గారావుపై దొంగతనం నేరం మోపారు. అనంతరం వారి ఇంటికి తీసుకువెళ్లి బాబి అతని భార్య షేక్‌మేరీ, తన కుమారుడు కలిసి అతడిని ఇనుపరాడ్డు, సుత్తితో కొట్టి దాడి చేశారు. అనంతరం అతడి కాళ్లు, చేతులు కట్టి, నోటిలో గుడ్డలు కుక్కి ఒక సంచిలో కట్టారు. ఆటోలో వేసుకుని ముగ్గురూ కలిసి బాబి స్వగ్రామమైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వెదిరేశ్వరం తీసుకువెళ్ళేందుకు ప్రయత్నించారు. మార్గమధ్యలో అతడు కదులుతూ ఉండడంతో మళ్లీ గట్టిగా సంచిని ఆటోకేసి కొట్టడంతో మృతి చెందాడు. అక్కడ నుంచి వెదిరేశ్వరం తీసుకువెళ్లి మృతదేహాన్ని సంచిలో నుంచి బయటకు తీసి మరో చిన్న సంచిలో మూటకట్టి ద్విచక్ర వాహనంపై బాబి, అతని కుమారుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా జొన్నాడలోని కోటిపల్లి కాలువలో పడవేసి ఇంటికి వచ్చేశారు. ఈనెల 21న మృతుడు సోదరుడు నాగరాజు ఫిర్యాదు మేరకు బాబి, అతడి భార్య మేరీని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. మృతదేహాన్ని కాలువలో పడవేసినట్లుగా చెప్పడంతో కాలువలో జాలర్ల సహాయంతో ఈనెల 23న మృతదేహాన్ని బయటకు తీశారు. అక్కడ పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ కేసులో ఎల్లా కోటేశ్వరరావు (బాబి), అతని భార్య షేక్ మేరీని అరెస్ట్ చేసి వారి వద్ద సుత్తి, ఇనుపరాడ్డు, సంచిని స్వాధీనం చేసుకున్నట్లుగా డీఎస్పీ తెలిపారు. కుమారుడు పరారీలో ఉన్నాడని తెలిపారు. సీఐ ఎన్.నాగరాజు, ఎస్ఐ కృష్ణాజీ, సిబ్బంది ఉన్నారు.

పట్టపగలే తాళం వేసిన ఇంట్లో చోరీ

» కేజీన్నర వెండి, రూ.2.50 లక్షల నగదు అపహరణ

జీలుగుమిల్లి, మే, 24:(ఆంధ్రజ్యోతి): జీలుగుమిల్లిలో ఓ వ్యాపారి ఇంటో పట్టపగలే గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడిన ఘటన జరిగింది. గ్రామానికి చెందిన సాదు చెన్నారావు కుటుంబం ఇటీవల ఎరువుల దుకాణం ఏర్పాటు చేసుకున్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం సమీప ఇంట్లో ఉంటున్నారు. ఇటీవల వ్యాపారం నిమిత్తం ఇంట్లో వారు మరోచోట ఏర్పాటు చేసుకున్న ఎరువుల దుకాణం వద్దకు వెళుతుంటారు. ఇదే అదునుగా శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దొంగలు ఇంటి దక్షిణం వైపు తలుపులకు వేసిన గడియలను తొలగించి లోపలికి ప్రవేశించారు. బీరువాలో కిలోన్నర వెండి, బ్యాగ్‌లో ఉన్న సుమారు రూ. 2.50 లక్షల నగదు దొంగిలించారని బాధితుడు చెన్నారావు కుటుంబ సభ్యులు తెలిపారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా బెడ్‌రూంలో బీరువా తలుపులు తెరిచి బట్టలు చిందరవందరగా పడి ఉండడం గమనించామన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని ఏఎస్ఐ నాగేశ్వరరావు పరిశీలించి విచారణ జరుపుతున్నారు.

మట్టి తరలిస్తున్న రెండు లారీలను అడ్డుకున్న పోలీసులు

పోలవరం, మే 24 : పోలవరంలో మట్టి రవాణా చేస్తు న్న రెండు లారీలను పోలీసులు శుక్రవారం రాత్రి అడ్డుకున్నారు. మట్టి రవాణా వాహనాల డ్రైవర్లు పోలీసులతో వాగ్వివాదానికి దిగడంతో రెవెన్యూ అధికారులు, పోలీసులు మట్టి రవాణా చేస్తున్న రెండు లారీలతో పాటు మరో రెండు ఖాళీ లారీలను పోలవరం పోలీస్ స్టేషన్‌కి తరలించారు. పోలవరం స్టేషన్ రైటర్ శ్రీనివాస్ తెలిపిన వివరాలివి.. తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం మండలం హుకుంపేట, బీమోలు ప్రాంతాల చెరువుల నుంచి గోపాలపురం రెవెన్యూ అధికారుల అనుమతులతో తరలిస్తున్న మట్టి గోపాలపురం మండలంలో పంటపొలాలకు తరలించాల్సి ఉండగా పరిధి దాటి పోలవరం తీసుకువచ్చి ఇటుక బట్టీలకు అమ్మకాలు జరుపుతున్నట్టుగా వచ్చిన సమాచారం మేరకు లారీలను స్వాధీనం చేసుకున్నామన్నారు. తహసీల్దార్ సాయిరాజు ఎదుట హాజరు పరచగా వారికి జరిమానా విధించినట్టు తెలిపారు.



వచ్చే నెలలో వందే భారత్ ?

నరసాపురం, మే 24(ఆంధ్రజ్యోతి): నరసాపురం-చెన్నై వందేభారత్ కూత వినేందుకు రోజులు సమీపిస్తున్నాయి. అన్నీ అనుకూలిస్తే.. జూన్ రెండో వారం లేదా నెలాఖరులోపు ఈ రైలు జిల్లాకు వచ్చే అవకాశం ఉంది. అవసరమైన ఏర్పాట్లను 90 శాతం నరసాపురం స్టేషన్‌లో పూర్తి చేశారు. రైల్వే బోర్డు నుంచి అనుమతి రాగానే రాకపోకల షెడ్యూల్‌ను ప్రకటించేందుకు దక్షిణ మధ్య రైల్వే సిద్ధంగా ఉంది. ప్రస్తుతం చెన్నై-విజయవాడ మధ్య ఈ రైలు నడుస్తుంది. దీన్ని నరసాపురం వరకు పొడిగించనున్నారు. చెన్నైలో ఉదయం ఐదు గంటలకు బయలుదేరి ఉదయం పదకొండు గంటలకు వస్తుంది. తిరిగి అక్కడ 3.30 గంటలకు బయలుదేరి రాత్రి 10 గంటలకు చెన్నై చేరుతుంది. కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ కృషి వల్ల ఈ రైలు పొడిగింపునకు ఆమోదం లభించింది.



వలలో చిక్కిన కొండచిలువ

వలకు చిక్కిన 8 అడుగుల కొండ చిలువ

పెంటపాడు,మే24(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు వేసిన వలలో కొండచిలువ చిక్కుకుంది. స్థానికులు తెలిపిన వివరాలివి.. మండలంలోని పరిమెళ్ల గ్రామం చినకాపవరం కాలువలో మత్స్యకారులు చేపల కోసం వలను వేశారు. ఈ వలలో సుమారు ఎనిమిది అడుగులు పొడవుగల కొండచిలువ చిక్కుకుంది. స్థానికులు భయభ్రాంతులకు గురికావడంతో పాములను పట్టే వ్యక్తికి ఫోన్ చేయగా అతడు వల నుంచి తొలగించి తీసుకెళ్లాడని తెలిపారు.



గుమ్ములూరు లాకుల వద్ద అమ్మవారి, డిప్యూటీ సీఎం ఫ్లెక్సీలు చింపిన దృశ్యాలు

ఫ్లెక్సీల చించివేత

» పోలీసులకు ముసలమ్మ జాతర కమిటీ సభ్యుల ఫిర్యాదు

ఆకివీడురూరల్, మే24(ఆంధ్రజ్యోతి) : ఆకివీడు మండలం గుమ్ములూరు పంచాయతీ పరిధిలోని పల్లిపాలెం లాకుల వద్ద పుంతలో ముసలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన పుంతలో ముసలమ్మ, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తోపాటు ఏర్పాటు చేసిన వారందరి ఫొటోలు చించివేశారని కొంతమంది కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కక్షపూరితంగా చేశారని, గ్రామాల్లో ప్రశాంతత లేకుండా వివాదాలు ఉండేవిధంగా కొంతమంది ఈవిధంగా చేస్తున్నారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. అమ్మవారి ఫొటో, పవన్ కల్యాణ్ ఫొటో కావాలని చింపేశారని ఆరోపించారు. దీనిపై పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

దోమల్ని నివారించాలి

తణుకు, మే 24(ఆంధ్రజ్యోతి): వర్షాలు పడుతున్న తరుణంలో వారం రోజులు నీరు నిల్వ ఉండే నీటిలో దోమలను నివారించాలని సబ్ యూనిట్ అధికారి జి.వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం సొసైటీ రోడ్డులో దోమల నివారణకు క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. ఈసందర్భంగా పలు గృహాలను సందర్శించి నీరు నిల్వ ప్రాంతాలను గుర్తించి వాటిని తొలగించినట్టు చెప్పారు. పరిశుభ్రత విషయంలో రాజీ లేకుండా చూసుకోవాలని తెలిపారు.

వైభవ వెంకన్నకు ద్రాక్ష పండ్ల అలంకరణ



నరసాపురం రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములదీవి గ్రామంలో శనివారం వైభవ వెంకటేశ్వరస్వామిని భక్తులు ద్రాక్ష పండ్లతో ప్రత్యేక అలంకరణ చేశారు. తూర్పుతాళ్ళు గ్రామానికి చెందిన వానశెట్టి కోశాధికారి కోట్ల బాలకృష్ణ, అరుణ దంపతుల ఆర్థిక సహకారంతో భారీ అన్నసమారాధన నిర్వహించారు. సుమారు 3వేల మంది స్వామివారి ప్రసాదాలు స్వీకరించారు.

విద్యుత్ శాఖలో చీకట్లు

(5వ పేజీ తరువాయి)

తరచూ పవర్‌కట్ అవుతోంది. వెంటనే మరమ్మతులకు తగిన సిబ్బంది లేకపోవడంతో సరఫరా పునరుద్ధరణకు గంటల సమయం పడుతోంది. శివారు ప్రాంత వినియోగదారులు మరింత ఇబ్బంది పడుతున్నారు.

అధిక లోడ్‌తో అవస్థలు



పిల్లా బాబులు, జనసేన పట్టణ అధ్యక్షుడు, ఆకివీడు

అధిక లోడ్‌తో గృహోపకరణాలు కాలిపోతున్నాయి. విద్యుత్ అధికారులకు చెప్పినా, సిబ్బంది కొరతతో సత్వరంగా సరఫరా జరగడం లేదు. వేసవిలో ఓర్వలేకపోతే ప్రజలు ఉక్కపోతకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

విద్యుత్ సమస్య పరిష్కరించాలి



దొకల రవితేజ, డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు, ఆకివీడు

బిల్లులు సక్రమంగా చెల్లించకపోతే విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. దీనిపై వున్న ఉత్సాహం, సమస్యల పరిష్కారంలో ఉండడం లేదు. విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయి. సామర్థ్యం తక్కువ వున్న ట్రాన్స్‌ఫార్మర్ల వల్ల అధిక లోడ్‌తో కాలిపోతున్నాయి. వినియోగదారులు లక్షల్లో నష్టపోతున్నారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలి.

ఉండేదెవరు ? వెళ్లేదెవరు ?

5వ పేజీ తరువాయి

పనిచేస్తున్నారు. దీంతో ఆయన సమీపంలోని నిడదవోలుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. మరో ఏఈ భీమవరం, లేదా తాడేపల్లిగూడెం వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే ఈ ఏఈకి అక్కడ ప్రజా ప్రతినిధులు సిఫారసు లేఖలు ఇచ్చారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. డీఈ కూడా ఇంజనీరింగ్‌లో ఉన్నత విద్య నిమిత్తం దీర్ఘకాల సెలవుపై వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. వీరు ముగ్గురు బదిలీలపై వెళ్లిపోతే ఈ పురపాలక సంఘానికి ఎవరూ రారన్న వాదనలు ఉద్యోగుల నుంచి వస్తున్నాయి. ఇప్పటికే వీరిని ఇక్కడే ఉండాలని కొందరు ప్రజా ప్రతినిధులు కోరినప్పటికీ ఆసక్తి చూపించడం లేదు. బదిలీ కౌన్సెలింగ్ పూర్తయితే ఎంత మంది మిగులుతారన్నది సస్పెన్స్‌గా మారింది.

టీడీపీ జిల్లా మహానాడులో
ఆరు తీర్మానాల ఆమోదం


తణుకు రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి):తణుకులో శనివారం జరిగిన జిల్లా టీడీపీ మహానాడులో ఆరు తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించారు.

- టీడీపీ 43 ఏళ్ల ప్రస్థానంలో రాష్ట్ర అభివృద్ధి, దేశ రాజకీయాల్లో టీడీపీ సాధించిన విజయాలపై నాయకులు, కార్యకర్తల హర్షాతిరేకాల మధ్య తీర్మానం ఆమోదించారు.
- కశ్మీర్‌లో పహల్గాం ఉగ్రదాడిపై ప్రతి చర్యగా మన దేశం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో సైనికులు, ప్రధాన మంత్రికి మద్దతుగా తీర్మానం ఆమోదించారు.
- తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలుగా సేవలిందించి మృతులైన వారికి, గత ప్రభుత్వం హయాంలో నిర్బంధాలను లెక్కజేయకుండా పార్టీ కార్యకర్తలుగా సేవలందించి, వైసీపీ దాడులలో అమరులైన పార్టీ నాయకులకు, కార్యకర్తల సంతాపం ప్రకటిస్తూ తీర్మానం ఆమోదించారు.
- సినీ వినీలాకాశంలో ధృవతారగా వెలిగి, రాజకీయ పార్టీని పెట్టి 9 నెలల్లోనే ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుకు భారతరత్న అవార్డును కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలని కోరుతూ మహానాడులో తీర్మానం చేశారు.
- టీడీపీ కార్యకర్తల సంక్షేమ నిధి పేరుతో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చేస్తున్న కృషిని అభినందిస్తూ జిల్లా మహానాడు తీర్మానం ఆమోదించింది.
- రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ సంకీర్ణ కూటమి ద్వారా రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమానికి, ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు చేస్తున్న కృషిని అభినందిస్తూ మహానాడు తీర్మానం ఆమోదించారు.

సాయి బాబా విగ్రహం ఊరేగింపు



ఆకివీడు, మే 24 (ఆంధ్రజ్యోతి): ఆకివీడు మాదివాడ శ్రీనివాసనగర్‌లోని షిరిడి సాయి బాబా మందిరం వార్షికోత్సవం సందర్భంగా సాయి వారం ఉదయం సాయి నామాలు రాసిన సాయికోటి పుస్తకాలతో బాబాను ఊరేగించారు. రాత్రి బాబాకు కోపల్లె సూర్యనారాయణ ఆధ్వర్యంలో భక్తులు పూలాభిషేకం నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి ఐదు కోట్ల సాయి నామాలు రాసిన పుస్తకాలు స్వామిచెంత వేస్తారు. రాత్రి 12 గంటల వరకూ అఖండ సాయి నామ సంకీర్తన జరుగుతుందన్నారు.



యోగా శిక్షకులతో మాట్లాడుతున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి.. యోగాలో పాల్గొన్న ఉద్యోగులు, తదితరులు

యోగాపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి: జేసీ

భీమవరం రూరల్/భీమవరం టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): యోగాతో ఎన్నో ఉపయోగాలు ప్రజలకు వివరించి, యోగ శిక్షణపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. యోగా మాసోత్సవంలో భాగంగా వంద మంది మాస్టర్ ట్రైనర్లకు యోగా శిక్షణ కార్యక్రమం శనివారం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ ఆడిటోరియంలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, డీఆర్‌వో మొగిలి వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ పొందినవారు ట్రాక్టర్ 50 మంది చొప్పున గ్రామాల్లో విడతల వారీగా యోగా శిక్షణ ఇవ్వాలన్నారు. అనంతరం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి మండల అభివృద్ధి అధికారులు, మున్సిపల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో యోగాంధ్ర వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్‌పై సమీక్షించారు.

మద్యం అనర్థాలపై అవగాహన ర్యాలీ

భీమవరం క్రైం, మే 24 (ఆంధ్రజ్యోతి): ఒక్క పెగ్గుతో మొదలై బాటిల్ మింగేసే వరకు వదలని జబ్బు మద్యం అలవాటు అని, మద్యం అలవాటు మీ ఆయుష్షును తినేస్తుందని ఎక్సైజ్ సీఐ కె.జలరాజుమారాజు అన్నారు. శనివారం శ్రీ ఆయుష్మాన్ వేదిక ఆధ్వర్యంలో భీమవరం పాత బస్టాండ్ వద్ద ఆటో యూనియన్ సభ్యులతో మద్యం మానండి.. ఆరోగ్యంగా ఉండండి అంటూ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాత బస్టాండ్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏసుబాబు, పోతుల పెద్దిరాజు, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి ప్రసంగించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

తాడేపల్లిగూడెం రూరల్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్‌శాఖ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కేవీ నాగ ప్రభుకుమార్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలోని డీల్ డీఎడిక్షన్ ట్రస్ట్ రిహేబిలిటేషన్ సెంటర్ వద్ద మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై శనివారం అవగాహన కల్పించారు. ఎక్సైజ్, ప్రొహిబిషన్ జిల్లా అధికారి కమలేశ్వరన్ మాట్లాడుతూ సమాజం ఆరోగ్యంగా ఉండాలంటే యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.

జగనన్న కాలనీలో సమస్యలు పరిష్కరించాలి

పెనుగొండ, మే 24 (ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీల్లో నివసించే ప్రజలు పరిస్థితి మరీ దుర్భరంగా ఉందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎస్. వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం సిద్ధాంతం గ్రామ శివారు పుటల దిబ్బ కాలనీకి సంబంధించి పలు సమస్యలపై కాలనీ వాసులతో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షం వస్తే కాలనీ మునిగిపోతుందని, గుంతలలో నీరు నిల్వ వలన దోమలు పెరిగి జ్వరాలు విజృంభిస్తున్నాయని కాలనీ వాసులు పేర్కొన్నారు.

తణుకు మహానాడుకు తెలుగు తమ్ముళ్లు

నరసాపురం టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): తణుకులో జరిగిన జిల్లా మహానాడుకు శనివారం తీర ప్రాంతం నుంచి తెలుగుతమ్ముళ్లు భారీగా తరలివెళ్లారు. ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో మొగల్తూరు, రూరల్, పట్టణం నుంచి ప్రత్యేక వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. ముందుగా పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో మత్స్యకారుల సహకార సంఘం సమాఖ్య చైర్మన్ కొల్లు పెద్దిరాజు, అధికారి అనంత రామారావు, వాతాడి ఉమా, జక్కం శ్రీమన్నారాయణ, పొన్నాల నాగబాబు, గుబ్బల నాగరాజు, హేమంత్, రమేష్, నక్కా ఆనంద్, కాశీ పాల్గొన్నారు.



జిల్లా మహానాడుకు శనివారంనాడు తరలి వెళ్లారు. వెళ్ళిన వారిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, అగ్నికుల క్షత్రియ రాష్ట్ర డైరెక్టర్ నాగిడి తాతాజీ, బీసీ సెల్ నాయకులు గంటా త్రిమూర్తులు, మాజీ కౌన్సిలర్ విజ్జురోతి రాఘవులు, క్లస్టర్ ఇన్‌చార్జి భూపతిరాజు బుజ్జిరాజు, మండల నాయకులు పెన్మత్స



భీమవరం, నరసాపురం నుంచి బయలుదేరిన టీడీపీ నాయకులు

భీమవరం టౌన్: భీమవరం నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ

సుమన్ రాజు ఉన్నారు.

ఆచంట: తణుకులో శనివారం జరిగినజిల్లా మహానాడు సభకు ఆచంట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో అనేక మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వివిధ వాహనాల్లో తరలి వెళ్లారు.



పాలకొల్లు హౌసింగ్ బోర్డు కాలనీలో నిలిచిన నీరు

ఉదయం వర్షం... మధ్యాహ్నం ఎండ

పాలకొల్లు అర్బన్, మే 24(ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా ఉదయం పూట వర్షం కురుస్తూ.. మధ్యాహ్నం నుంచి భానుడు భగభగమంటున్నాడు. శనివారం తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. అలాగే రెండు రోజులుగా ఉదయం వర్షం కురుస్తోంది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఇక మధ్యాహ్నం నుంచి భానుడు తన ప్రతాపం చూపడంతో ఎండ వేడిమి పెరిగి ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు తరచూగా అనధికారికంగా విద్యుత్ కోతలు విధిస్తుండటంతో చిన్నారులు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. ఉదయం వేళలో ఆకాశంలో మేఘాలు పట్టి ఉండి.. మధ్యాహ్నం నుంచి ఎండ తీవ్రత పెరుగుతోంది.

ఎన్నికల హామీలు నెరవేరుస్తున్నాం: ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నీ వరుసగా నెరవేరుస్తున్నాం వైసీపీ నాయకులు చౌకబారు విమర్శలు చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని విమర్శించే అర్హత మాజీ సీఎం జగన్‌కు లేదని అన్నారు. శనివారం పట్టణంలోని మారెళ్ల ఫంక్షన్ హాల్‌లో 59 మంది లబ్ధిదారులకు సుమారు రూ.45 లక్షల విలువ కలిగిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొలిశెట్టి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కేవలం వైసీపీ శ్రేణులకు మాత్రమే సీఎం సహాయ నిధి అందేదని ప్రస్తుతం రాజకీయాలకు అతీతంగా కష్టాల్లో ఉన్న ప్రతి ఒక్కరికి సీఎం సహాయనిధిని అందిస్తున్నామన్నారు.



లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించిన ఎమ్మెల్యే బొలిశెట్టి

గురిచేసిందన్నారు.

276 జీవోతో 108 ఉద్యోగులకు భరోసా

తాడేపల్లిగూడెం అర్బన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం 276 జీవోతో 108 ఉద్యోగుల కుటుంబాలకు భరోసా కల్పించిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం భవనంలో 108 ఉద్యోగుల విజయోత్సవ సభను నీలపాల దినేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం 108 ఉద్యోగులను తీవ్రంగా ఇబ్బందులకు

టిడ్కో సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

తాడేపల్లిగూడెం రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): టిడ్కో ఇళ్ల సముదాయం సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. తాడేపల్లిగూడెం మండలం ఎల్ అగ్రహారం సమీపంలోని టిడ్కో సముదాయాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికులు వారి సమస్యలను వివరించారు. విద్యుత్ సరఫరా, మంచినీరు, పారిశుధ్య సమస్యలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నరసింహమూర్తి, మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు పాల్గొన్నారు.



ఆచంటలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పితాని

ట్రాన్స్‌ఫార్మర్లు ప్రారంభం

ఆచంట, మే 24(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఎక్కడా లోవోల్టేజీ సమస్య లేకుండా అవసరమైన చోట కొత్త విద్యుత్‌ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్టు ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. ఆచంటలోని శివాలయం వద్ద, మదనగోపాలస్వామి ఆలయం వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను శనివారం ఎమ్మెల్యే పితాని ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి, తమ్మినీడి ప్రసాద్, కేతా మీరయ్య, నీలా నరసింహమూర్తి, సీతారామ్, కేతా మురళి పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి: ఎస్పీ

భీమవరం క్రైం, మే 24 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ అండ్ నాన్ గ్రేవ్ కేసులు దర్యాప్తు వేగవంతం చేయాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశించారు. జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో శనివారం ఎస్పీ జిల్లా పోలీసు కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్ నుంచి జూమ్ వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా నెలవారీ నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గ్రేవ్ అండ్ నాన్ గ్రేవ్ కేసులు, ఎస్‌సీఎస్‌టీ, ఎన్‌డీపీఎస్, పోక్సో, రేప్, రోడ్డు యాక్సిడెంట్, పెండింగ్ ఎన్‌బీడబ్ల్యూఎస్, ఇతర కేసులతో పాటు డీవోలలో ఉన్న పెండింగ్ కేసుల దర్యాప్తుపై సమీక్షించారు. ఈ సమీక్షలో పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలు, అరెస్ట్, కేసు దర్యాప్తు తీరుతెన్నులపై సంబంధిత పోలీస్ అధికారులతో ఆరా తీశారు. అరెస్టులు, చార్జిషీట్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉండకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్పీ అన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ నయీం అస్మి

పోలీసులు ఇతర దేశస్థులపై ప్రత్యేక నిఘా పెట్టారు. ముఖ్యంగా బంగ్లాదేశ్, పాకిస్తాన్ వంటి ప్రాంతాల నుంచి ఎవరైనా దేశంలోకి చొరబడితే వారి వివరాలు, అలాగే వారిపై ప్రత్యేక నిఘా పోలీసులు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా పశ్చిమ గోదావరి జిల్లాలో పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన బెంగాలీ కార్మికులు ఎక్కువగా ఉన్నందున వారి ముసుగులో బంగ్లాదేశీయులు ఉన్నారన్న అనుమానాన్ని వ్యక్తం చేస్తూ నిఘా పెట్టారు. దీనికి సంబంధించి శనివారం భీమవరంలో బంగారు వర్తకులకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎవరైనా అనుమానితులు ఉంటే వెంటనే సమాచారం అందించాలని కోరారు.

ఇతర దేశస్థులపై ప్రత్యేక నిఘా

ఇటీవల విజయనగరంలో ఉగ్రదాడిని భగ్నం చేసిన



మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును సన్మానించిన నాయకులు, కార్యకర్తలు

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా

ఆచంట, మే 24(ఆంధ్రజ్యోతి): ప్రతి వైసీపీ కార్యకర్తకు అండగా ఉంటానని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం తూర్పుపాలెం లోని క్యాంప్ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో వైసీపీ పీఏసీ మెంబర్‌గా నియమితులైన రంగనాథరాజును పలువురు పార్టీ నాయకులు పూల మాలలతో అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

పాలకొల్లు రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలపల్లి గ్రామంలో ఉపాధి కూలీలకు శనివారం కూటమి నాయకులు మజ్జిగ పంపిణీ చేశారు. మంత్రి నిమ్మల రామానాయుడు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ ఉపాధి కూలీలకు రోజూ మజ్జిగ పంపిణీ చేయాలని ఆదేశించారు. దీంతో దాతలు, కూటమి నాయకులు రోజూ పంపిణీ చేస్తున్నారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు వేగేశ్న శ్రీహరిరాజు, గోనేటి రామకృష్ణ, పాలపర్తి చంద్రరావు, సున్నపురోయిన నాగరాజు, గుబ్బల హరిప్రసాదు, జనసేన గ్రామాధ్యక్షుడు నూకల శ్రీను, గుడిసె సురేంద్ర పాల్గొన్నారు.



కాంక్రీట్ గోడ నిర్మాణ పనుల పరిశీలన

పాలకొల్లు రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉల్లంపర్రు గ్రామంలో కాలువ వెంబడి రూ.కోటి 65లక్షలతో చేపట్టిన కాంక్రీట్ గోడ నిర్మాణ పనులను పాలకొల్లు ఏఎంసీ చైర్మన్ కడి విజయభాస్కర్ శనివారం పరిశీలించారు. నియోజకవర్గంలో రూ.100కోట్లతో కాలువల తవ్వకం, గ్రావెల్ రోడ్లు, వంతెనలు, కాంక్రీట్ గోడల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు పాముల రమేష్‌బాబు, డొక్క ఏడుకొండలు, పాసర్ల శ్రీను, సాగర్ సత్యనారాయణ, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా

తాడేపల్లిగూడెం అర్బన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏపీ భవన, కార్మిక సంక్షేమ మండలి చైర్మన్ వలవల బాబ్జి అన్నారు. జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ అనుబంధ సంఘాల ప్రతినిధులు శనివారం పట్టణంలోని టీడీపీ పార్టీ కార్యాలయంలో వలవల బాబ్జిని మర్యాదపూర్వకంగా కలసి సత్కరించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ కార్మికుల సమస్యలను బాబ్జికి వివరించారు. జిల్లా భవన నిర్మాణ సంఘం అధ్యక్షుడు బొల్లాడ నాగరాజు, ఏరియా



వలవల బాబ్జిని సత్కరించిన భవన నిర్మాణ నాయకులు, కార్మికులు

కమిటీ అధ్యక్షుడు ఓసూరి వీర్రాజు, పోలిరాతి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



అజ్జమూరు వద్ద రుద్రాయకోడు

రుద్రాయకోడు ప్రక్షాళన ప్రారంభం

ఆకివీడు రూరల్ మే24 (ఆంధ్రజ్యోతి): రుద్రాయకోడు ముంపునకు గురికాకుండా ప్రక్షాళన శనివారం ప్రారంభమైంది. చెరుకువాడ వద్ద ప్రారంభమైన రుద్రాయకోడు ముంపునకు గురికాకుండా పూర్తిగా తూడు, గుర్రపుడెక్క, సిల్ట్ తొలగిస్తారని డ్రైనేజీ అధికారులు తెలిపారు. జాతీయ విపత్తు నిధుల నుంచి రూ. 39లక్షలు మంజూరు అయ్యాయని వారు తెలిపారు.

గొల్లలకోడేరులో కాలువ ప్రక్షాళన

పాలకోడేరు, మే 24 (ఆంధ్రజ్యోతి): ఉండి నియోజకవర్గంలో శివారు ప్రాంతాలకు పూర్తి స్థాయిలో సాగునీరు అందించడమే డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు లక్ష్యంగా పెట్టుకున్నారని పశ్చిమ గోదావరి జిల్లా నీటి సంఘం చైర్మన్ ముదునూరి నాగరాజు అన్నారు. శనివారం పాలకోడేరు మండలం గొల్లలకోడేరు గ్రామంలో మంచినీటి కాలువ ప్రక్షాళన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు ఆయన చేపట్టిన ఈ మహత్తర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు కమ్మిలి రాంబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పశు వైద్యశాల ప్రారంభం

పెనుగొండ, మే 24 (ఆంధ్రజ్యోతి): రైతు పక్షపాతి కూటమి ప్రభుత్వమని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. నడిపూడి గ్రామంలో నూతనంగా నిర్మించిన పశు వైద్యశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం పాడి రైతులకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు.

సమస్యల పరిష్కారం సంతృప్తికరంగా ఉండాలి

భీమవరంటౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజలు నుంచి స్వీకరించిన వినతుల పరిష్కారం ప్రజలు సంతృప్తికరంగా ఉండాలని రాష్ట్ర పీజీ ఆర్ఎస్ అధికారి సీహెచ్ చిన్నారావు అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక పోర్టల్‌లో పరిష్కారం చేసిన సమస్యలు తదితర అంశాలపై జిల్లా లోని వివిధ ప్రభుత్వ శాఖలు, జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో శనివారం అమరావతి సీఎం కార్యాలయం నుంచి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా జాయింట్ కలెక్టర్ టిరా హుల్ కుమార్‌రెడ్డితో పాటు డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, ఎస్డీ భీమారావు, జిల్లా గ్రామ వార్డు సచివాలయం అధికారి వై. దోసిరెడ్డి పాల్గొన్నారు.

ఉప సర్పంచ్‌పై అవిశ్వాస తీర్మానం

కాళ్ల, మే 24 (ఆంధ్రజ్యోతి): కాళ్ల మండలం ఎలిపన్ పురం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌పై అవిశ్వాస తీర్మానానికి సంబంధించి శనివారం భీమవరం ఆర్డీవో ప్రవీణ్ కుమార్‌రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రస్తుత ఉప సర్పంచ్‌పై అవిశ్వాస తీర్మానం కోరుతూ పలువురు వార్డు మెంబర్లు ఇచ్చిన ఫారం-04పై నిర్వహించిన సమావేశంలో పది మంది వార్డు సభ్యులు ఏడుగురు సభ్యులు ఉపసర్పంచ్ శ్రీనివాస్‌కి వ్యతిరేకంగా ఓటు వేశారు. దీంతో ఉప సర్పంచ్ తన పదవిని కోల్పోయినట్టు అధికారులు స్పష్టం చేశారు.

ఉపసర్పంచ్ రాజీనామా

ఎలిపన్ పురం పంచాయతీ ఉపసర్పంచ్ మైలా శ్రీనివాస్ తన పదవికి రాజీనామా చేశారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జిస్సా రిని కలిసి తన రాజీనామా పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల గ్రామంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలకు విసుగు చెంది తన పదవికి రాజీనామా చేసినట్టు తెలిపారు.

సీసలిలో అన్నసమారాధన

కాళ్ళ, మే 24 (ఆంధ్రజ్యోతి): సీసలి గ్రామంలో భక్తాంజనేయస్వామి ఆలయం వద్ద హనుమాన్ జయంతి వేడుకలు మూడు రోజులుగా ఘనంగా నిర్వహించారు. చివరి రోజైన శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి 32 రకాల పిండి వంటలు, స్వీట్లతో మహానివేదన సమర్పించి ఆలయ ప్రాంగణంలో అఖండ అన్న సమారాధన నిర్వహించారు. జనసేన ఉండి ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజు, ఆకివీడు ఏఎంసీ చైర్మన్ గొర్రాల వెంకటశివరామరాజు, మాజీ ఎంపీపీ ఆరేటి వెంకటరత్నప్రసాద్, మాజీ సర్పంచ్ కట్రెడ్డి శ్రీనివాసరావు, వేణుగోపాల్ స్వామిని దర్శించుకున్నారు.

ఉమా పాలేశ్వరస్వామి ఆలయానికి విరాళం

ఇరగవరం, మే 24 (ఆంధ్రజ్యోతి) : ఇరగవరంలోని ఉమాపాలేశ్వర స్వామి ఆలయానికి దువ్వూరి గిరిజాశంకర్ దంపతులు లక్ష రూపాయల విరాళం అందించారు. ఈ విరాళానికి చెక్కు రూపంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తంగిరాల గోపాలకృష్ణమూర్తి, దేవాలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావుకు శనివారం అందజేశారు.

క్లస్టర్లుగా సచివాలయాల విభజన

గణపవరం, మే 24 (ఆంధ్రజ్యోతి) : గణపవరం మండల గ్రామ సచివాలయాల స్వరూపం మారనుంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామసచివాలయాల పునర్వవస్థీకరణలో భాగంగా గణపవరం మండలంలోని 20 సచివాలయాలను 10 క్లస్టర్లుగా అధికారులు విభజించారు. మండలంలోని గణపవరం - 1, గణపవరం - 2 సచివాలయాలను కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేశారు. గణపవరం - 3, 4 కలిపి క్లస్టర్ రెండవ క్లస్టర్‌గాను, ఏజీవరం, అర్ధవరం, సచివాలయాలను 3వ క్లస్టర్‌గాను, ఎస్.కొండేపాడు, అప్పన్నపేట, సచివాలయాలను 4వ క్లస్టర్‌గాను, సీహెచ్.అగ్రహారం, కాశీపాడు సచివాలయాలను 5వ క్లస్టర్‌గాను, ముప్పర్తిపాడు, కేశవరం సచివాలయాలయాలను 6వ క్లస్టర్‌గాను, మొయ్యేరు, కోమర్రు, సచివాలయాలను 7వ క్లస్టర్‌గాను, వల్లూరు, జల్లికొమ్మర సచివాలయాలను 8వ క్లస్టర్‌గాను, పిప్పర 1, పిప్పర 2 సచివాలయాలను 9వ క్లస్టర్‌గాను, కొత్తపల్లి, సరిపల్లి సచివాలయాలను 10వ క్లస్టర్‌గాను మండల పరిషత్ అధికారులు విభజించారు. ఇది ఇలా ఉండగా ప్రస్తుతం మండలంలో విధులు నిర్వహిస్తున్న సుమారు 50 మంది సచివాలయ ఉద్యోగులను ఈ క్లస్టర్లలో పలు హోదాల్లో సర్దుబాటు చేస్తారని అధికారులు వెల్లడించారు.

కుష్ఠు రోగులకు పాదరక్షలు పంపిణీ

నరసాపురం టౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గ్రేస్‌గేయల్ కాలనీలో శనివారం 40 మంది కుష్ఠు రోగులకు పాదరక్షలు పంపిణీ చేశారు. లీసీ జిల్లా ఆడిషనల్ మెడికల్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ భానునాయక్ విచ్చేశారు. అతికాళ్లలో తిమ్మిర్లు, పుండ్లు ఉన్న వారికి ఈ పాదరక్షలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న పింఛన్‌పై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జక్కంపూడి రామప్రసాద్, రమేష్, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం

నరసాపురం రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని సరిపల్లి గ్రామానికి చెందిన వెలిగట్ల వెంకట నాగ మాధుర్ త్వరలో ఇండియా- నేపాల్ మధ్య జరిగే టీ 20 సిరీస్‌కు ఎంపికయ్యారు. ఆర్థిక స్తోమత లేకపోవడంతో పలువురు క్రీడాకారులు, దాతలు మాధుర్‌కు అండగా నిలుస్తూ వస్తున్నారు. ఇప్పటికే జైన్ యూత్ అసోసియేషన్ కొంత మొత్తాన్ని ప్రకటించింది. తాజాగా మండలంలోని కొప్పర్రు గ్రామానికి చెందిన జనసేన నాయకులు పోలిశెట్టి శ్రీనివాస్ 20వేల ఆర్థిక సాయాన్ని అందించారు. శనివారం ఆయన నివాసంలో మాధుర్‌ను సత్కరించారు.

5న అత్తిలి మండల సమావేశం

అత్తిలి, మే 24 (ఆంధ్రజ్యోతి) : అత్తిలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వచ్చే నెల 5న మండల అధ్యక్షుడు మక్కా సూర్యారావు అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో పి శ్యామ్యూల్ తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

మహిళలు సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి

తణుకు, మే 24 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఎలాంటి సమస్యలనైనా ధైర్యంగా ఎదుర్కోవాలని నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. శనివారం పోలీసులు, మహిళా శిశు సంక్షేమ శాఖ, ప్యానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, కోర్టు సిబ్బందికి, న్యాయ విజ్ఞాన సదస్సులో పనిచేసే సిబ్బందితో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల్లో సెక్సువల్ హెరాస్మెంట్ లాంటి వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలని అన్నారు. సమస్యను పోలీస్ స్టేషన్‌కు తెలపాలని, సమస్యను ఖండించాలని తెలిపారు. పిల్లలు మిస్సింగ్ అయినవెంటనే పోలీసులకు, 1098 చైల్డ్ లైన్‌కు తెలియజేయాలని వివరించారు.

ట్యాంకు వాల్వ్‌లో పడిన గేదె



ఆకివీడు, మే 24 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు శాంతినగర్ మంచినీటి పథకం వాల్వ్‌లో గేదె పాడిగేదె పడింది. స్థానికులు లక్ష్మీనాయుడుకు చెందిన గేదె వాల్వ్ సమీపంలో గడ్డి మేస్తుండగా మూడు రోజుల క్రితం పడిపోయింది. గేదె రావడంతో రెండు పోట్లాడుకున్నాయి. మంచినీటి ట్యాంకుకు సంబంధించిన వాల్వ్‌లో గేదె పడిపోయింది. ఈ విషయం గేదె యజమాని దృష్టికి తీసుకెళ్లగా అగ్నిమాపకశాఖకు తెలియజేశారు. సిబ్బంది, స్థానికులు జేసీబీ సాయంతో గేదెను బయటకు తీశారు. గేదెకు స్వల్ప గాయాలయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పెనుమంట్ర, మే 24 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తలకి తీవ్ర గాయమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలం కొయ్యేటిపాడు గ్రామానికి చెందిన షలగాల సత్యనారాయణ రెడ్డి (48) కొయ్యల చెరువు వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా సుమారు 12-30 గంటల ప్రాంతంలో ఐదెంటి సెంటర్‌లో విలేజ్ హెల్త్ క్లినిక్ సమీపంలో రోడ్డు మరమ్మతులు నిమిత్తం బారికేడ్లను అడ్డంగా ఉంచగా బాల్ కేట్లను తన ద్విచక్ర వాహనంతో ఢీ కొట్టి రోడ్డుపై పడిపోయాడు. క్షతగాత్రుడిని విజయవాడ ప్రైవేట్ హాస్పటల్‌కు తరలించినట్టు సమాచారం.